# విజయ

రచన:
శ్రీ తమ్మిశెట్టి రామారావు

గాలి వుధృతంగా వీస్తోంది. రోడ్డు ప్రక్క వేప చెట్టు పెనుభూతంలా అంగ విన్యాసం చేస్తోంది. వుండుండి ఆ వీధిలోని ధూళి ఆకాశ వీధిలోనికి అల్లా లేచి వెళ్ళిపోతోంది. ఆ గాలిధాటికి తట్టుకోలేని కిటికీ తలుపులు టపటపమని కొట్టుకొంటున్నాయి. కొద్ది క్షణాల్లో కుండపోత వర్షం కురియడానికి సిద్ధంగా కారు మేఘాలు ఆకాశాన్ని అలుముకొంటున్నాయి.

అలాగే జయరాం నిర్మించుకొన్న ఆశా సౌధాలు నేల కూలి, నిరాశా మబ్బులు దట్టంగా మనస్సునావరించు కొంటున్నాయి. చేతిలోని కాగితాలు గాలికి రెపరెప లాడుతున్నాయి. మనస్సులో అగ్నిపర్వతాలు బ్రద్దలై, లావాద్రవం లాంటి కన్నీళ్లు అగ్ని గోళాల్లాంటి కన్నుల నుండి స్రవిస్తున్నాయి. గొంతువరకూ పెగిలివస్తున్న దుఃఖాన్ని హాలాహలంలా వెనక్కి మ్రింగలేక మ్రింగ లేక మ్రింగుతున్నాడు జయరాం.

గాలి హోరు తగ్గి, వురుములు మెరుపులతో వాన జల్లు ప్రారంభమైంది. పట్టపగలే చిట్ట చీకట్లు క్రమ్ము కొంటున్నాయి. గదంతా చీకటితో నిండిపోయింది. జయరాం మనసంతా పిచ్చి పిచ్చి ఆలోచనలతో నిండి పోయింది. కుర్చీలో నుండి భారంగాలేచి వెళ్ళి లైటు వేసాడు. క్షణంలో కారు చీకట్లను పారద్రోలి గదిలో కాంతి ఆక్రమించుకొంది.

తానైతే ఆ గదికి వెలుగు ప్రసాదించగలిగాడు, కాని తన జీవిత సౌధానికి వెలుగు ప్రసాదించేవారెవరు? ఆకాశంలో పెద్ద మెరుపు మెరసి మాయమైంది. తన జీవితంలోకూడ ఒక ఆశ మెరుపులా మెరసి మాయమైంది.

క్షణక్షణానికి బయట వర్షపు హోరు హెచ్చవుతోంది. ఎముకల్ని కొరికే చలిగాలి రివ్వు రివ్వుమంటు వీస్తోంది. గది తలుపులన్నీ బంధించి వచ్చాడు జయరాం.

గది తబుపులు బంధించి ఎముకలు కొరికే చలిగాలిని గదిలోనికి రాకుండా చేయగలిగాడేగాని, మది తలుపులు మూసివేసి చెద పురుగుల్లా మనసును దొలిచివేసే చెలి తలుపులు మాత్రం మదిలోనికి రాకుండా చేసుకోలేకపో తున్నాడు. జీవితంలో ఏదో పోగొట్టుకొన్నట్లు బాధ పడుతూ గదిలో పచార్లుచేస్తూ, మరొక్కసారి విజయ దగ్గరనుండి వచ్చిన వుత్తరాన్ని చదువుకోసాగాడు.

ప్రియమైన జయరాంగారికి —

మీకు ఆ నాడు వీడ్కోలు యివ్వడానికి మీతో పాటే నేనూ రైల్వే స్టేషన్‌కి వచ్చాను. మీరు వెళ్ళి పోతూ నాకొక కవరిందించారు. అది మీరు ఇస్తున్నప్పుడే యిలాంటిదేదో ఒకటి జరిగివుంటుందని వూహించు కొంటూ యింటికి నడిచాను. కవరు విప్పి సాంతం చదివే సరికి నేననుకొన్నదే నిజమైంది.

మీరు నన్ను అపార్థం చేసుకొన్నారని చెప్పడంలో సందేహం ఏమీ లేదు. మా ఆదరణ, ఆప్యాయత, అభిమానమే మీకా అవకాశాన్ని యిచ్చిందని అనుకొం టున్నాను. ఇంతకూ మూలం మీరానాడు నన్ను కాపాడకుండా వుంటే, మీతో పరిచయం జరిగివుండేదే కాదు,......జయరాం వుత్తరం చదవడం మధ్యలో ఆగాడు. గతంలో జరిగిన ఆనాటి సంఘటన సినిమా రీల్లా ఒకసారి మస్తిష్కంలో తిరగసాగింది.

(తరువాయి 94వ పేజీలో)



పూర్ణా ఆర్ట్ పిక్చర్స్‌వారి

"కూతురు కోడలు"

చిత్రంలో

హేమలత


రావికొండలరావు—గీతాంజలి.

(26వ పేజీ తరువాయి)

కాలేజీకి టైమ్ కావచ్చింది. టైమ్ టేబుల్ ప్రకారం పుస్తకాలు తీసుకొని, గదికి తాళంవేసి బయట నిల్చున్నాడు జయరాం. రోజూ తను ఎదురుచూసుకొని వెళ్లే అమ్మాయి నీటి పంపుదగ్గరనుండి యింకా కదలి రాలేదు. ఐదు నిమషాలు నిరీక్షించాడుతను. ఇంతలో ఆ అమ్మాయి బిందె చంకన పెట్టుకొని రావడంతో, అంతవరకూ అందుకే వేచివున్నవాడల్లా అడుగు ముందుకు వేసాడు.

అంతలో వూర కుక్కలు రెండు కొట్లాడుకొంటూ పరుగు పరుగున వచ్చి ఆ అమ్మాయి ప్రక్కగా విల్లునుండి వదిలిపెట్టిన బాణాల్లా దూసుకుపోయాయి. అంతే


ఆరోగ్య సౌభాగ్యములకు
మహిళలు ఆదారపడునవి
ఆరోగ్య అనారోగ్య పరిస్థితులలో:—
లోధ్ర
♦
గర్భపోషణకు, సుఖప్రసవమునకు :—
గర్భ రక్షక
♦
వేవిళ్ళకు. మలబద్ధకమునకు;—
''మాదీఫల'' రసాయనం
♦
ప్రసవానంతరం బలమునకు
క్షీరవృద్ధికి :—
సౌభాగ్య శొంఠి
♦
70 సంవత్సరములకు పైగా
ప్రసిద్ధినొందిన ఔషధములు.
కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్,
మదరాసు-14
ఏజెంట్లు :
సీతారామ జనరల్ స్టోర్సు (ఏజన్ సీస్)
విజయవాడ.

మాడరన్ థియేటర్సువారి ''నేనూ మనిషినే'' చిత్రంలో నూతన తార శకుంతల-గుమ్మడి.

క్షణంలో ఆ అమ్మాయి తూలి ప్రక్కకు పడబోయింది జయరాం వెంటనే ఆ అమ్మాయిని క్రింద పడకుండా పట్టుకొన్నాడు. ఆ అమ్మాయి చంకలో బిందె జారి అల్లంతదూరం దొర్లి వెళ్లిపోయింది.

చాలా థాక్సండీ!...సమయానికి మీరు ఆదుకోకపోతే ఈ పాటికి నా నడుము విరిగేది. మీ మేలు జన్మలో మరిచిపోలేనండీ?...సిగ్గుతోనే అంది ఆమె,

నో మెన్‌క్షన్ ప్లీజ్, ఈ పాటిదానికేనా?

మానవులం...ఒకరికొకరు సహాయపడకపోతే మానవత్వమేముంటుందీ?

ఆ అమ్మాయి జయరాం ముఖంవైపు చూసింది, ఏదో చెప్పలేని అనుభూతి కలిగింది తనకు. దొర్లిపోయినబిందె తెచ్చి యిచ్చాడు జయరాం. ఇక వస్తానండీ అంటూ కదలిబోయిందామె.

మేడం! మీరు ఏమీ అనుకోకపోతే...మీ పే...రు, అడిగాడు జయరాం.

విజయ...! చెప్పి వెళ్లిపోయిందామె.

వాస్తవంలోనికి వచ్చాడు జయరాం. అపుడు ఆనాడు విజయతో అలా పరిచయం జరగకపోయినట్లయితే,

ఈ నాడు తనకీబాధ వుండేదికాదు.

మళ్ళీ వుత్తరం చదువుకోవడం ప్రారంభించాడు జయరాం.

మిమ్మల్ని మరునాడు మా అమ్మకు పరిచయంచేసాను. నాలాగే అమ్మకుకూడా మీ మీద సదభిప్రాయమూ, చెప్పలేని అనుబంధమూ ఏర్పడ్డాయి. జయరాంగారూ మీలాగే నాకొక అన్నయ్య వుండేవాడు. బి.ఏ. చదువుతూ రెండేండ్ల క్రితం స్కూటర్ ఆక్సిడెంట్‌లో మరణించాడు. అమ్మ ఆవేదనకు అంతే వుండేదికాదు. మిమ్మల్ని చూసిన దగ్గరనుండి తన కొడుకింకా బ్రతికే వున్నాడని తృప్తి చెందేది. అలాగే నేనూ సంతోషపడే దాన్ని.

మీతో గడిపిన క్షణాలే అన్నయ్యతో గడిపినట్లు భావించి మీతో సినిమాలు...షికార్లు...కానిగాకాని గామీరు నన్ను తప్పు అర్థం చేసుకొన్నారు. మీ మనసులో ఇటువంటి కోరికవుండేని ఏనాడూ సూటిగా నాతో చెప్పలేకపోయారు. అదే ఈ దుష్పరిణామానికి దారి తీసింది. నామీద ఏదో ఆశలు పెంచుకొని గాలి మేడలు కట్టుకొన్నారు. నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నానని అభిప్రాయపడ్డారు.

అవును మిమ్మల్ని మనసారా నేను ప్రేమిస్తున్నాను. ఒక చెల్లెలు ఒక అన్నను ఎలా ప్రేమిస్తుందో అలా ప్రేమిస్తున్నాను. ఆ ప్రేమ నిర్మలమైంది. పవిత్రమైంది. జయరాంగారు? మిమ్మల్నే నా అన్నగా భావించి,

SOLVE YOUR WATER PROBLEM
With
'SSF' DOMESTIC PUMPSETS



Specialists in Producing
Single phase monoblocs,
Single phase Motors,
Jet pumpsets.
*Manufacturers :*
**SREE SRINIVASA FOUNDRY**
Ammankulam Road.
P. N. Palayam, COIMBATORE-18.
Phone : 31701



సాగర్ మూవీస్ వారి
"భాగ్యవంతుడు"
చిత్రంలో
చంద్రకళ-చంద్రమోహన్.

ఎల్లప్పుడూ....
బ్రిందా బనియన్లనే ఉపయోగించండి,



రాయలసీమలో ఏజెంట్లు కావలెను.
వివరములకు :
**BRINDA HOSIERY MILLS**
DHARAPURAM ROAD :: TIRUPUR-4

ఇన్నాళ్లు నా మనసులో దాగివున్న బాధను గాధను మీ ముందుంచుతున్నాను.

నేను కాలేజీలో పి.యు.సి. చదివే రోజుల్లో శ్రీధర్ అనే యువకుణ్ని మనసారా ప్రేమించాను. 'ఆల్ దిగ్లిట్టర్స్ ఈజ్ నాట్ గోల్డ్' అన్న సామెత నాకింకా బాగా తెలియదు. పై మెరుగులకే భ్రమసిన నేను శ్రీధర్‌లో ఆత్మ సంస్కారంలేదని ఆనాడు గ్రహించలేకపోయాను. అతనితో పరిచయం రానురాను ప్రణయంగా మారింది. పరిణయం చేసుకోమని నేను పట్టుబట్టేసరికి నన్ను మోసగించి వెళ్లిపోయాడు శ్రీధర్.

నాజీవిత ఆశయాలు, ఆదర్శాలు మొగ్గలోనే మ్రగ్గిపోయాయి. నాన్న చనిపోయేవరకూ నన్ను పెండ్లి చేసుకోమని ప్రాధేయపడేవారు. నేను వారి మాట కాదనే దానిని. చాలాసార్లు చావాలనిపించేది. చచ్చి సాధించేదేముంది. అమ్మకూడ కన్నుమూసాక, వున్న ఒక్క తమ్ముడి భవిష్యత్తేమికావాలి? అందుకే బ్రతకాలనుకొన్నాను; బ్రతుకుతున్నాను.

మీ మనస్సు నిర్మలమైంది, వెన్నలాంటిది. కలుషితమైన నేను మీ జీవితంలో ప్రవేశించి, మీకు తీరని ద్రోహం చేయలేను. మీ ప్రేమకు నేను అర్హురాల్ని కాను. ఒక సోదరిగా మాత్రమే భావించి నన్ను క్షమించండి. మీ మనస్సుక్షోభపెట్టినందు నన్ను క్షమించావని



అన్నపూర్ణా ఆర్ట్సువారి

"అమాయకురాలు"

చిత్రంలో

నాగేశ్వరరావు-కాంచన.

ఒక్కసారి మీ మనస్సులో అనుకోండి. క్షమిస్తారన్న ఆశతో.

ఇట్లు,
ఒక అభాగ్యురాలు,
విజయ.

పుత్తరం పూర్తిచేసిన జయరాం మనసు కంపపు కోతయింది. బరువెక్కిన హృదయంతో బాధగా విజయ నన్ను ప్రేమించలేదు, విజయ నన్ను ప్రేమించలేదు. అని గట్టిగా అరిచాడు. ఆ వాన హోరులో ఆ పురుముల సవ్వడిలో తన మాటలు ఎవరికి వినిపిస్తాయి. పెద్ద మెరుపు మెరిసి మాయమైంది. పట్నంలో కరెంటు ఫెయిల్ అయింది. గదంతా చీకటయింది.

---

(6వ పేజీ తరువాయి)

యీ విషయాన్ని గుర్తించి 'కథాంజలి'కి తోడ్పడాలని నా మనవి.

ఇకపోతే ఏ పత్రిక కయినా అడ్వర్టైజ్‌మెంట్లు ప్రాణవాయువును సమకూరుస్తాయన్నది కాదనరాని సత్యం. నిజానికి దినవారపత్రికలన్నీ వీటిమీదనే జీవయాత్ర సలుపుతున్నాయి. అల్లాంటప్పుడు 'కథాంజలి' మనుగడ కూడా వీటిమీదనే ఆధారపడి ఉందని నేను మనవి చేయక తప్పదు.

చాలమంది పారిశ్రామికులు, చిత్రనిర్మాతలు నాకు అడ్వర్టైజ్‌మెంట్లు విషయంలో సాయం సలుపుతూనే ఉన్నారు. వారందరికీ కృతజ్ఞతాపూర్వకంగా నా నమోవాకాల నర్పిస్తున్నాం. ఇకముందు కూడా వీరు నాకు తమ అండదండలను సముచితరీతిని సమకూరుస్తారని నా విశ్వాసం.

'సర్వేజనా సుఖినోభవంతు' అంటూ యీ శుభసమయంలో పాఠకులకు, వ్యాపార ప్రకటన కర్తలకు, అభిమానులకు నా హృదయపూర్వక శుభాకాంక్షలను తెలియజేస్తున్నాం.

—సంపాదకుడు.


WECO

# MOTORS, PUMPS & MONOBLOCKS

- Excellent Performance
- Low Current Consuption.
- Long Life.

**OUR RANGE OF PRODUCTS**

- Electric Motors.
- Centrifugal Pumps
- Domestic Pumps
- Monoblock Sets.



—MANUFACTURERS—

Grams: "TERMINALS" Phone: Office: 25606. Res: 32510

**WAKEFIELD ENGINEERING COMPANY**

POST BOX NO. 847

PEELAMEDU, COIMBATORE-4.